

ఎన్నికల బృందం పర్యటన

నగరంలో ఎన్నికల జాబితాను కేంద్ర ఎన్నికల బృందం సభ్యులు బుధవారం పరిశీలించారు.

- 8లో ▸



వీఆర్ఏల సర్దుబాటుకు..

వీఆర్ఏలను క్రమబద్ధీకరించిన నేపథ్యంలో వారిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
26.6 /21.7

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పార్ట్ టైం ఉపాధ్యాయుల భర్తీకి గడువు పొడిగింపు

■ అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సుభాష్‌నగర్: జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తాత్కాలిక పద్ధతిన పార్ట్‌టైం ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తులను ఈనెల 20 వరకు పొడిగించినట్లు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను సంబంధిత గురుకులాల్లో పనిదినాల్లో సమర్పించాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, బీఈడీతో పాటు టెట్ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఇందల్వాయి బాలికల పాఠశాల విభాగానికి గణితం, ఫిజికల్ సైన్స్, సాంఘిక శాస్త్రం, పీఈటీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. బీమన్‌పల్లి, ఆర్మూర్ బాలుర జూనియర్ కళాశాల విభాగానికి జువాలజీ, ఆంగ్లం పోస్టుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారని వివరించారు. అభ్యర్థులు పూర్తి వివరాల కోసం 8333925399, 8333925400 నంబర్లను సంప్రదించాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన ఏర్పర్చుకోవాలి



సుభాష్‌నగర్: ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రతి ఒక్కరూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం) పనితీరుపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల వినియోగం, వాటి పనితీరుపై అవగాహన కల్పించేందుకు వీలుగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. కేంద్రంలో ప్రజల అవగాహన నిమిత్తం అందుబాటులో ఉంచిన నమూనా ఈవీఎం, వీవీ ప్యాట్‌ల పనితీరును స్వయంగా పరిశీలించి పలు వివరాలను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజల అవగాహన కోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రెండు చొప్పున అవగాహన కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌కుమార్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

బోధన్ ఎంఐఎం కౌన్సిలర్లకు బెయిల్



ఖలీల్‌వాడి: బోధన్ ఎమ్మెల్యే షకీల్‌తో పాటు అనుచరులపై హత్యాయత్నం కేసులో అరెస్ట్ అయిన ఇద్దరు ఎంఐఎం కౌన్సిలర్లకు బెయిల్ మంజూరైంది. బుధవారం జిల్లా కేంద్రంలోని సారంగపూర్‌లో గల జిల్లా జైలు నుంచి బయటకు వచ్చారు. బెయిల్‌పై బయటకు వచ్చిన ఎంఐఎం కౌన్సిలర్లు అల్తాఫ్, నవీద్ రజాలకు నగర డిప్యూటీ మేయర్ ఇద్రిజ్‌ఖాన్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు షకీల్‌తో పాటు పలువురు ఎంఐఎం నేతలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఐఎం నేతలు మాట్లాడుతూ జూన్‌లో బోధన్ పట్టణంలో పర్యటించిన సందర్భంగా ఎమ్మెల్యే షకీల్ అభివృద్ధిపై ప్రశ్నించినందుకు ఇద్దరు కౌన్సిలర్లపై అక్రమ కేసులను నమోదు చేశారన్నారు. ప్రశించిన వారిని జైలుకు పంపించడం ఏమిటన్నారు. బోధన్ అభివృద్ధి కోసం ఎంఐఎం పార్టీ పోరాడుతుందన్నారు.

రాత్రి 10.30 గంటల వరకు విధుల్లో ఉండాలి

■ విద్యుత్ సిబ్బందికి సీఎండీ ఆదేశాలు

నిజామాబాద్ నాగారం : జిల్లాలో విద్యుత్ అధికారులు, ఉద్యోగులందరూ రాత్రి 10.30 గంటల వరకు విధులు నిర్వర్తించాలని సీఎండీ గోపాల్‌రావు ఆదేశించారు. బుధవారం విద్యుత్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ...రైతులకు 24 గంటల కరెంటు ఇస్తున్న నేపథ్యంలో అందరు తమతమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు, ఏడీలు, క్షేత్రస్థాయిలో ఉండి సరఫరా విషయంలో పర్యవేక్షణ చేయాలన్నారు. ఆయా డివిజన్లకు సంబంధించిన బోధన్, ఆర్మూర్, నిజామాబాద్, నిజామాబాద్ రూరల్ డీఈలు వీరు పనిచేస్తున్నారో లేదో పర్యవేక్షణ చేస్తూ ఎప్పటికప్పుడు నివేదికలను అందించాలన్నారు. అవసరమైతే వీడియో కాల్స్ చేస్తానని స్పష్టం చేశారు.

నగరంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



రుద్రూర్‌లో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, పాల్గొన్న నాయకులు



బీఆర్ఎస్ – కాంగ్రెస్ పవర్ వార్..

- విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ఇరు పార్టీల పోటాపోటీ ఆందోళనలు
- అటు రేవంత్, ఇటు కేసీఆర్, కేటీఆర్‌ల దిష్టిబొమ్మల దహనం
- నగరంలో కొట్టుకున్న బీఆర్ఎస్ శ్రేణులు

అధికార, ప్రతిపక్ష పార్టీల పోటాపోటీ ఆందోళనలకు జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సబ్‌స్టేషన్లు వేదికగా మారాయి. బీఆర్ఎస్ శ్రేణులు రేవంత్ దిష్టిబొమ్మలను దహనం చేయగా, కాంగ్రెస్ కార్యకర్తలు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరాపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రాజకీయ దుమారం రేగింది.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరాపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రగిలిన రాజకీయ దుమారం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య పోటాపోటీ ఆందోళనలకు దారితీసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని సబ్‌స్టేషన్ల వద్ద రేవంత్ దిష్టిబొమ్మలను దహనం చేయాలని బీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చింది. ఇందుకు ప్రతిగా సబ్‌స్టేషన్ల వద్దే కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయాలని కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ఇరు పార్టీల శ్రేణులు బుధవారం ఆందోళనలు నిర్వహించాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు రేవంత్ దిష్టిబొమ్మలను దహనం చేయగా, కాంగ్రెస్ కార్యకర్తలు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి రుద్రూర్ మండలంలో నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉచిత విద్యుత్‌ను ఉమ్మడి రాష్ట్రంలో ఇవ్వడం మొదలు పెట్టిందే కాంగ్రెస్ పార్టీ అన్నారు. అధికారంలో ఉన్నప్పటికీ, లేకున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రైతుల పక్షమేనన్నారు. విద్యుత్ కొనుగోలు విషయమై కేసీఆర్ ప్రభుత్వం చేసిన అవినీతి బయటపడుతుందనే భయంతోనే బీఆర్ఎస్ పార్టీ రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరించిందన్నారు. మంత్రి కేటీఆర్ కావాలనే ఇలా చేశారన్నారు. ప్రజలు, రైతులు బీఆర్ఎస్ నాయకుల మాటలను నమ్మే పరిస్థితి లేదన్నారు. అదేవిధంగా మోర్తాడ్ మండలంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైతుల్లో బీఆర్ఎస్ పట్ల తీవ్ర వ్యతిరేకత నెలకొన్న నేపథ్యంలో కేసీఆర్ కుటుంబం గందరగోళానికి గురవుతోందన్నారు. ఇక కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బాడ్సి శేఖర్‌గౌడ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి మోపాల్ మండలంలోని తాడెంలో పాల్గొన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి డిచ్‌పల్లి మండలంలో ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు.

■ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. రేవంత్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ నీతూకిరణ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు. అయితే ఇక్కడ బీఆర్ఎస్‌లో మేయర్ భర్త దండు శేఖర్ అనుచరుల మధ్య కొట్లాట చోటు చేసుకుంది. దండు శేఖర్ కజిన్ సోదరుడు రవి, మరో అనుచరుడు బబ్లూ మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరికొకరు కొట్టుకున్నారు.



ఘర్షణకు దిగిన బీఆర్ఎస్ నాయకులు

మరోసారి విచారణ

- తెలంగాణ యూనివర్సిటీలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు
- మాజీ రిజిస్ట్రార్లతో పాటు 8 మందిని ప్రశ్నించిన అధికారులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ వర్సిటీలో బుధవారం మరోసారి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ జరిపారు. ఉదయం 11.30 గంటలకు క్యాంపస్‌కు చేరుకున్న అధికారులు సాయంత్రం 5.30 గంటల వరకు ఇద్దరు మాజీ రిజిస్ట్రార్లతో పాటు మరో 8 మందిని విచారించారు. ఏసీబీకి పట్టుబడి జైల్లో ఉన్న వీసీ రవీందర్‌గుప్తా అవినీతి, అక్రమాలపై వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదటిసారిగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గత జూన్ 6న దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో పలు రికార్డులు, సీపీయూలు, హార్డ్‌డిస్క్‌లను అధికారులు తమ వెంట తీసుకెళ్లారు. జూన్ 13న రెండోసారి క్యాంపస్‌కు వచ్చి మరికొన్ని రికార్డులను వెంట తీసుకెళ్లారు. మధ్యలో ఒకసారి భిక్కనూరు సౌత్‌క్యాంపస్‌ను సందర్శించి కొన్ని రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. రికార్డులను, హార్డ్‌డిస్క్‌లను సుమారు నెలపాటు క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు సంబంధిత వర్సిటీ అధికారులు, సిబ్బందిని విచారణ చేసేందుకు బుధవారం మరోసారి తెయూకు వచ్చారు. తాము విచారణ జరపబోయే వారిని అందుబాటులో ఉండేలా చూడాలని మంగళవారం రిజిస్ట్రార్ యాదగిరికి అధికారులు సమాచారమిచ్చారు.

మాజీ రిజిస్ట్రార్లతో పాటు..

తెయూ వీసీ రవీందర్‌గుప్తా అక్రమాలకు సహకరించారని ఆరోపణలు ఉన్న మాజీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్లు కనకయ్య, విద్యావర్ధినితో పాటు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ అరుణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు సాయాగౌడ్, విజయలక్ష్మి, సూపరింటెండెంట్ భాస్కర్(అకౌంట్ సెక్షన్), అసిస్టెంట్ ఇంజినీర్ వినోద్, సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కవిత తోరణ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ శాంతాబాయిలను విజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు. ముఖ్యంగా ప్రభుత్వం, పాలకమండలి అనుమతి లేకుండా అక్రమ పదోన్నతులు, నియామకాలు ఎలా చేపట్టారని, టెండర్లు పిలవకుండా కోట్ల రూపాయల కొనుగోళ్లు ఎలా చేశారని మాజీ రిజిస్ట్రార్‌లను ప్రశ్నించినట్లు సమాచారం. నిధుల దుర్వినియోగం, జరిగిన అవకతవకలపై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. పరీక్షల విభాగంలో ఇష్టారాజ్యంగా నిధులు ఖర్చు చేయడంపై కంట్రోలర్ అరుణను ప్రశ్నించినట్లు సమాచారం. అసలు నిధుల వినియోగంపై ప్రొసీజర్ ఏంటీ, ఎలా పాలో అవుతారని అడిగి తెలుసుకున్నారు. వీసీ, రిజిస్ట్రార్ నోట్‌షీట్‌లను ప్రకారం తాము పనిచేశామని వారు చెప్పగా విజిలెన్స్ అధికారులు ప్రతి ఒక్కరి స్టేట్‌మెంట్‌ను విడివిడిగా నమోదు చేసుకున్నారు. విజిలెన్స్ డీఎస్పీతో పాటు ముగ్గురు అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు సుదీర్ఘంగా విచారణ జరిపారు.



మాజీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌ను విచారిస్తున్న విజిలెన్స్ అధికారులు

సౌత్‌క్యాంపస్‌లోనూ..

భిక్కనూరు: భిక్కనూరు సౌత్‌క్యాంపస్‌లోనూ అధికారులు సుమారు మూడు గంటల పాటు తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు రికార్డులను పరిశీలించారు. వీసీ రవీందర్ గుప్తా, రిజిస్ట్రార్ విద్యావర్ధిని హయాంలో బాలుర, బాలికల వసతిగృహాల్లో కొనుగోలు చేసిన వస్తువులను పరిశీలించారు. వివిధ డిపార్టుమెంట్లలో తనిఖీలు చేశారు. ప్రిన్సిపాల్ కవితా తోరన్‌తో మాట్లాడా వివరాలు తెలుసుకున్నారు.

ఐదు రోజులు.. ఒక టీఎంసీ..

- కాళేశ్వరం నుంచి ఎస్సారెస్పీకి వచ్చిన ఇన్‌ఫ్లో
- ప్రస్తుత ఏడాది 30 టీఎంసీలు తరలించాలని ప్రభుత్వ నిర్ణయం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి కాళేశ్వరం నీళ్లు ఐదు రోజుల నుంచి వచ్చి చేరుతున్నాయి. బుధవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి కాళేశ్వరం నీళ్లు ఒక టీఎంసీ వచ్చి చేరినట్లు ప్రాజెక్టు అధికారుల రికార్డులు తెలుపుతున్నాయి. ప్రాజెక్టులోకి కాళేశ్వరం నుంచి నీటి తరలింపు కొనసాగుతోంది. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మూడు లేదా నాలుగు పంపుల ద్వారా 2,708 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుత సంవత్సరం వర్షాభావ పరిస్థితుల వలన కాళేశ్వరం నుంచి రోజుకు 0.5 టీఎంసీ చొప్పున 60 రోజుల్లో 30 టీఎంసీల నీటిని తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ప్రతిరోజూ ఇప్పటి వరకు 0.25 టీఎంసీల నీరు వచ్చి చేరుతోందని అధికారులు చెబుతున్నారు. భవిష్యత్తులో నీటి తరలింపు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.



ప్రాజెక్టులోకి ప్రవహిస్తున్న కాళేశ్వరం నీరు

ఎగువ నుంచి ఇన్‌ఫ్లో

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 2,193 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. కాళేశ్వర, ఎగువ ప్రాంతాల నుంచి కలిపి 4,901 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(90 టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టులో 1066.20అడుగుల(22.9 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.

రైతుల సంక్షేమంతోనే రాష్ట్రాభివృద్ధి

- కాళేశ్వరం నీటితో జన్మ ధన్యం
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



సంతమల్లన్న లిఫ్ట్‌కు పైపులైన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: రైతుల సంక్షేమంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. వేల్పూర్ మండలం అంక్సాపూర్ వద్ద వరద కాలువ నుంచి సంతమల్లన్న ఎత్తిపోతల పథకానికి నిర్మించిన పైపులైన్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు అన్ని సౌకర్యాలతో ఉన్నప్పుడే తెలంగాణ గాని, భారతదేశం గాని ముందడుగు వేస్తుందన్నారు. రైతు బాగుండని రోజు ఏ సమాజానికి కూడా మంచిది కాదన్నారు. అందుకే రైతుకు కావాల్సిన కరెంటు, నీళ్లు, పెట్టుబడి సహాయం ఈ మూడింటిని సమయానికి సీఎం కేసీఆర్ అందజేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ తెచ్చుకున్న ప్రతిఫలం ప్రత్యక్షంగా చూస్తున్నామన్నారు. కాళేశ్వరం నీళ్లు శ్రీరాంసాగర్‌కు రావడాన్ని వందల మంది రైతులు ప్రత్యక్షంగా చూస్తూ ఆశ్చర్యపడుతున్నారన్నారు. కాళేశ్వరం నీళ్లు కింది నుంచిపైకి వస్తాయనుకోలేదని, ఇది సాధ్యం చేసిన కేసీఆర్‌కు, తనకు రైతులు ధన్యవాదాలు చెబుతుంటే చాలా ఆనందం కలుగుతోందన్నారు. పదిసార్లు మంత్రి అయినా ఇంతటి ఆనందం రాదన్నారు. ఈ జీవితానికి ఇది చాలు అన్నంత తృప్తి కలుగుతోందన్నారు. రైతులకు మూడు గంటల కరెంటు సరిపోతుందని ఒక ప్రబుద్ధుడు పేర్కొన్నారని, కరెంటు కష్టాలు అనుభవించిన పాత రోజులు తిరిగి అవసరమా అని రైతులు ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ రమేశ్‌రెడ్డి, ఎంపీపీ బీమజమున, జెడ్పీటీసీ భారతిరాకేశ్‌చంద్ర, సర్పంచ్ ఎడ్ల రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ రవి, నాయకులు మిట్టపల్లి మహిపాల్, దేగాం రాములు, రేగుల్లరాములు, నాగధర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రిక్కమధు, వీడీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

షిర్డీ రైలులో మహిళా దొంగలు

- కొంతమంది బ్యాగులు, మహిళ బంగారు చైన్ మాయం
- తొమ్మిది మంది యువతులను పట్టించిన ప్రయాణికులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ మీదుగా తిరుపతి నుంచి షిర్డీ వెళ్తున్న సాయినగర్ షిర్డీ రైలులో దొంగతనానికి పాల్పడిన తొమ్మిది మంది యువతులను ప్రయాణికులు పట్టుకుని రైల్వే పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల నుంచి 3 గంటల మధ్య ఈ ఘటన జరిగింది. రైలు నిజామాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరిన తర్వాత నవీపేట్ స్టేషన్ వద్ద క్రాసింగ్ ఉండటంతో అక్కడ అగిపోయింది. దీంతో మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు చెందిన తొమ్మిది మంది యువతులు రైలులో ఎక్కారు. యువతులు ఎస్1 నుంచి ఎస్10 బోగీలలో అటుఇటూ తిరిగినట్లు ప్రయాణికులు తెలిపారు. మొదట ఓ బోగీలో ప్రయాణికుడి బ్యాగ్ కనబడకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. అప్రమత్తమైన ఆ కోచ్‌లోని మిగతా వారు తమ బ్యాగ్‌లను చెక్ చేసుకోగా మరో ఆరుగురికి చెందిన బ్యాగులు కూడా కనిపించలేదు. దీంతో బోగీలో కలకలం రేగింది. కొందరు ప్రయాణికులు బాసర వద్ద ట్రైన్ చైన్ లాగడంతో ఆగిపోయింది. ఈ క్రమంలో కొందరు యువతులు బ్యాగులతో పరుగెత్తడంతో ప్రయాణికులు పట్టుకున్నారు. బాసర పోలీసులకు సమాచారం అందించి, మొత్తం తొమ్మిది మందిని అప్పగించారు. ఆర్‌ఎస్ఎఫ్, బాసర పోలీసులు అక్కడి నుంచి యువతులను నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

విచారిస్తున్న రైల్వే పోలీసులు

రంగస్వామి అనే ప్రయాణికుడికి చెందిన బ్యాగ్‌తో పాటు ల్యాప్‌టాప్, కొంత నగదు, ఓ మహిళ మెడలోని బంగారు చైన్ పోయినట్లు తెలిసింది. పావని, ధనుంజయ్, షేక్ నజీర్‌బాషా, లీలావతి, సుబ్బారాయుడు, శ్రీనివాస్ అనే ప్రయాణికుల బ్యాగ్‌లు పోయాయి. మూడు బ్యాగ్‌లను పోలీసులు రైల్వేపట్టాల పక్కన గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కొన్ని బ్యాగులను యువతులు బాత్‌రూంలలో పెట్టినట్లు తెలిసింది. అదుపులోకి తీసుకున్న తొమ్మిది మందిని రైల్వే పోలీసులు విచారిస్తున్నారు. యువతులు నాందేడ్‌లోని గురుద్వార్‌కు వెళ్లి అక్కడ నుంచి నిజామాబాద్ వచ్చినట్లు తెలిసింది.

తీరనున్న ఆక్సిజన్ కొరత

- జీజీహెచ్‌లో సిద్ధమైన ఆక్సిజన్ ప్లాంట్
- ఆస్పత్రికి యేటా రూ. 26 లక్షలు ఆదా
- తెలంగాణలో పెసో సర్టిఫికేషన్‌తో తొలిప్లాంటు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆక్సిజన్ కొరత తీరనుంది. పెసో(పెట్రోలియం ఎక్స్‌ప్లోజివ్ అండ్ స్టేఫీ ఆర్గనైజేషన్) లైసెన్స్ కల్గిన ఆక్సిజన్ సిలిండర్ ప్లాంట్ నిజామాబాద్‌లో ఏర్పాటు అయింది. ఇప్పటి వరకు ఆక్సిజన్ సిలిండర్లను కొనుగోలు చేస్తూ వచ్చిన ఆస్పత్రి ఇక నుంచి సొంతంగా తయారు చేసుకునే సామర్థ్యం సంపాదించింది. ప్లాంట్‌తో ఆస్పత్రి అవసరాలకు పోనూ ఇతర హాస్పిటల్స్‌కు కూడా ఆక్సిజన్ సరఫరా చేసే అవకాశం ఉంది. కరోనా సమయంలో ఆస్పత్రికి సిలిండర్ల కొరత తీవ్రంగా ఏర్పడింది. ఆ సమయంలో నిర్మన్ ఫౌండేషన్‌లో పనిచేసే నిజామాబాద్‌కు చెందిన ఒకరు ఆస్పత్రికి సొంతంగా ఆక్సిజన్ ప్లాంట్ ఉంటే బాగుంటుందని ఆస్పత్రి వర్గాలను కలవడంతో దీనికి బీజం పడింది. ఆయన వెంటనే క్వాలోకమ్ ఇంటర్నేషనల్ కంపెనీ ప్రతినిధులను కలిసి ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు విషయమై చర్చించారు. ఆ కంపెనీకి చెందిన వారు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తాకు పరిచయం ఉండడంతో రూ.మూడు కోట్ల వ్యయంతో ప్లాంట్ ఏర్పాటుకు ముందుకువచ్చారు. దీంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్లాంట్ ఏర్పాటుకు కావాల్సిన అన్ని అనుమతుల కేంద్ర ప్రభుత్వం నుంచి సాధించారు. పెసో సర్టిఫికేషన్ జారీ చేసిన మొదటి ఆక్సిజన్ సిలిండర్ ఫిల్లింగ్ ప్లాంట్ ఇదే కావటం గమనార్హం.

నిత్యం 200 సిలిండర్ల సామర్థ్యం

జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ సిలిండర్ల ఫిల్లింగ్ ప్లాంట్‌లో నిత్యం 200 జంబో ఆక్సిజన్ సిలిండర్లను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. ప్రస్తుతం వంద సిలిండర్ల ఆక్సిజన్ ఉత్పత్తి చేయనున్నారు. ఆస్పత్రికి కావాల్సిన ఆక్సిజన్ ఉపయోగించుకుని అవసరమైతే బయట కూడా విక్రయించే అవకాశం ఉంది. ప్రస్తుతం జీజీహెచ్‌లో నిత్యం 10 వరకు జంబో ఆక్సిజన్ సిలిండర్లు, బీ టైప్ సిలిండర్లు 15 వినియోగిస్తున్నారు. వీటికి నెలకు రూ. 2.20 లక్షల వరకు ఖర్చు అవుతోంది.



జీజీహెచ్ ఎదుట ఏర్పాటు చేసిన ప్లాంట్

పెసో సర్టిఫికేషన్ గల మొదటి ప్లాంట్



పెసో సర్టిఫికేషన్ జారీ చేసిన మొదటి ఆక్సిజన్ ప్లాంట్ నిజామాబాద్‌లో ఏర్పాటు కావటం సంతోషంగా ఉంది. దేశంలోనే ఇది మొదటిది. క్వాలోకామ్ కంపెనీ వారు మొదట సాధారణ ప్లాంట్ ఇస్తామంటే వద్దన్నాం. ఇటువంటి ప్లాంట్‌కు పెసో సర్టిఫికెట్ తప్పనిసరి. దానికి చాలా వ్యయం అవుతుందని కంపెనీ వారు చెప్పడంతో కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి డబ్బులు చెల్లించకుండా అనుమతులు సాధించాం. క్వాలోకామ్ ఇంటర్నేషనల్ కంపెనీ ప్రతినిధులు, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్లాంట్‌ను త్వరలో ప్రారంభించేందుకు యత్నిస్తున్నాం.

– ప్రతిమారాజ్, ఆస్పత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు



బోధన్: విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని, ఫిర్యాదులు వచ్చే పరిస్థితి రావద్దని ఐసీడీఎస్ జిల్లా పీడీ రసూల్‌బీ అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం బోధన్ ప్రాజెక్టు స్థాయి అంగన్‌వాడీ టీచర్ల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె హాజరై, మాట్లాడారు. సిబ్బంది సమయ పాలన పాటించి కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. కేంద్రంలోని పిల్లలు, గర్భిణులు, బాలింతల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. సీడీపీవో జానకమ్మ, సూపర్‌వైజర్లు రాధిక రాథోడ్, ప్రమీల, వనజ, గోపి, సౌజన్య, శ్రీలత, మణి, ఆసియా పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బుధవారం జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఒక విద్యార్థి డిబార్ అయినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షకు 8,259 మంది విద్యార్థులకు గానూ 7,600 మంది హాజరు కాగా 659 మంది గైర్హాజరయ్యారని కంట్రోలర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షకు 5,023 మంది విద్యార్థులకు గానూ 4,363 మంది హాజరు కాగా 660 మంది గైరాజరయ్యారని కంట్రోలర్ తెలిపారు. నిజామాబాద్‌లోని నిశిత డిగ్రీ కాలేజ్ పరీక్ష కేంద్రంలో ఒక విద్యార్థి డిబార్‌కు గురైనట్లు తెలిపారు.

బిచ్కుంద వాసికి డాక్టరేట్



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ లెక్చరర్ పనిచేస్తున్న కొడగంటి అశోక్ డాక్టరేట్ అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో జంతుశాస్త్ర సీనియర్ ప్రొఫెసర్ పర్యవేక్షణలో 'ఇన్‌సెక్ట్ పేస్ట్ సోయాబీన్' అంశం పై ఆయన రిసె ర్చ్ పూర్తి చేశారు. దీంతో యూనివర్సిటీ అశోక్ కు డాక్టరేట్ అందించి సన్మానించారు. బిచ్కుంద కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ చంద్రముఖర్జీ ఆయనను అభినందించి, సన్మానించారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు



మద్నూర్: మండలంలోని లింబూర్ శివారులో బుధవారం కుక్కల దాడిలో కృష్ణజింక తీవ్రంగా గాయపడింది. వెంటనే గ్రామస్తులు జింకను కాపాడి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. గ్రామ శివారులో కుక్కల గుంపు కృష్ణజింకపై దాడి చేయగా, అక్కడే ఉన్న రైతులు వెంటనే స్పందించి కుక్కలను చెదరగొట్టి జింకను కాపాడారు. తీవ్ర గాయాలైన జింకకు సపర్యాలు చేసి అటవీశాఖ అధికారులకు అప్పగించారు.

వీఆర్‌ఏల సర్దుబాటుకు కసరత్తు!

- ఐదు శాఖల్లో ఆప్షన్లకు అవకాశం
- వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం ఆదేశం



మోర్తాడ్‌లోని తహసీల్దార్ కార్యాలయం

సుభాష్‌నగర్/మోర్తాడ్(బాల్కొండ): వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించిన నేపథ్యంలో వారి విద్యార్హతలు, సామర్థ్యాలను అనుసరించి వివిధ శాఖల్లో సర్దుబాటు చేసేందుకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఈమేరకు బుధవారం సబ్ కమిటీ సభ్యులతో వీఆర్‌ఏ జేఏసీ హైదరాబాద్‌లో సమావేశమైంది. ఇప్పటికే జిల్లాలోని వీఆర్‌ఏల వయస్సు, విద్యార్హతలు, అనుభవం ఆధారంగా తహసీల్దార్ల ఆధ్వర్యంలో సేకరించిన సమగ్ర సమాచారం ప్రభుత్వానికి నివేదించిన విషయం తెలిసిందే. కాగా వీఆర్‌ఏలను పంచాయతీరాజ్, జలవనరులశాఖ, మిషన్ భగీరథ, మున్సిపాలిటీ, రెవెన్యూలో సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు వారికి ఆప్షన్లు ఇవ్వనున్నట్లు తెలిసింది.

జిల్లాలో 1624 వీఆర్‌ఏలు..

జిల్లాలో 452 రెవెన్యూ గ్రామాలు ఉండగా, అందులో 1,624మంది వరకు వీఆర్‌ఏలు పనిచేస్తున్నారు. వీరిలో ఏపీపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ ద్వారా 130 మంది వరకు నియమితులయ్యారు. మిగతా వారు వారసత్వంగా వచ్చిన వారు. వీరిలో 340 మంది వరకు డిగ్రీ, ఆపైన, 210 మంది ఇంటర్, 500మంది వరకు పదోతరగతి చదువుకున్న వారు ఉన్నారు.

ఎన్నికల సమయంలోనే...

త్వరలో రాష్ట్ర శాసనసభ ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వీఆర్‌ఏలను ఇతర శాఖల్లో విలీనం చేయడం ఎన్నికల నిర్వహణకు ప్రధాన ఆటంకం కలుగుతుందనే వాదన వినిపిస్తుంది. బూత్ లెవల్ అధికారులుగా(బీఎల్‌వో), ఎన్నికల తంతు ముగిసేవరకు ఎన్నో రకాల సేవలు అందించే వీఆర్‌ఏలు ఇతర శాఖల్లో కొనసాగితే రెవెన్యూ శాఖ కార్యక్రమాలు సన్నగిల్లి ఎన్నికల ప్రక్రియకు ఇబ్బందికరమైన పరిస్థితి నెలకొంటుందనే వాదన బలంగా వినిపిస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వీఆర్‌ఏల సర్దుబాటుపై పునరాలోచన చేయాలని పలువురు సూచిస్తున్నారు.

'రెవెన్యూ'లో మొదలైన అంతర్మథనం..

రెవెన్యూ శాఖకు పట్టుగొమ్మలుగా ఉన్న వీఆర్‌ఏలను ఇతర శాఖల్లో విలీనం చేస్తే రెవెన్యూ కార్యకలాపాలు ఎలా సాగుతాయో అనే సంశయం వ్యక్తమైతుంది. వీఆర్‌వోల వ్యవస్థను రద్దు చేయడం, ధరణి వెబ్‌పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకవచ్చినా భూముల సమస్యలకు పూర్తి స్థాయిలో పరిష్కారం లభించలేదు. ఇదే తరుణంలో వీఆర్‌ఏలను ఇతర శాఖల్లో సర్దుబాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించడంతో రెవెన్యూ శాఖలో తీవ్ర చర్చ సాగుతుంది. వీఆర్‌ఏలు ఎన్నో రకాల పనులు చేస్తుండగా ప్రభుత్వం మాత్రం తమకు అనుకూలమైన పనులు చేయించుకోవడం కోసం ఏర్పాట్లు చేసుకుంటుంది. వీఆర్‌ఏలను తమ అభీష్టానికి విరుద్ధంగా ఇతర శాఖల్లో విలీనం చేస్తే రెవెన్యూ శాఖ పని తీరు ప్రశ్నార్థకంగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ఉచిత విద్యుత్ పథకం కాంగ్రెస్ మానస పుత్రిక

రుద్రూర్: వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరాకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని, ఉచిత విద్యుత్ పథకం కాంగ్రెస్ మానస పుత్రికని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాటలను బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించి అసత్య, అసందర్భ అంశాన్ని తెరపైకి తెచ్చి రైతులను తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ బీఆర్‌ఎస్‌లో భయాన్ని కలిగించిందని, అందుకే అధికార పార్టీ నాయకులు రోడ్డుపైకి వస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ శ్రేణులు గ్రామాల్లో వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని విమర్శించారు. జిల్లా మంత్రి, స్పీకర్, ఎమ్మెల్యేలు జిల్లాలోని సహజ వనరులను దోచుకుంటున్నారని ఆరోపించారు. బాన్సువాడ నియోజక వర్గ కాంగ్రెస్ కార్యకర్తలు రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచారని అభినందించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ సెగ్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్, జెడ్పీఫ్లోర్ లీడర్ అంబర్‌సింగ్, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

పంటకు దిష్టి తగలొద్దని..



నిజామాబాద్ మండలం మల్కాపూర్(ఎం) గ్రామ శివారులోని రోడ్డు పక్కన గల కూరగాయల తోటలో రైతు పంటకు దిష్టి తగలకుండ ఓ బొమ్మను ఏర్పాటుచేసి దానికి దిష్టి బొమ్మను తగిలించారు. దీంతో దారిన వెళ్లేవారు పంటపై దృష్టిపెట్టకుండా ఈ దిష్టిబొమ్మ విశేషంగా ఆకర్షిస్తుంది. ఈ బొమ్మను బుధవారం సాక్షి తన కెమెరాలో బంధించింది.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

నగరంలో కేంద్ర ఎన్నికల బృందం పర్యటన



పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తున్న అధికారులు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో ఓటర్ల జాబితాను బుధవారం కేంద్ర ఎన్నికల బృంద సభ్యులు ప్రమోద్‌కుమార్‌శర్మ, రితేష్ షింగ్‌లు పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో మూడు గంటల పాటు వారు ఓటర్ల జాబితాను పరిశీలించారు. బీఎల్‌వోస్, సూపర్‌వైజర్ల వారీగా పిలుచుకుంటూ ఓటర్ల నమోదు ప్రక్రియనుపరిశీలించారు. జిల్లాలో చేపట్టిన రెండో విడత ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం గురించి కేంద్ర ఎన్నికల బృందం దృష్టికి తెచ్చారు. అలాగే క్షేత్రస్థాయిలోనూ నాగారం, కసాబ్‌గల్లీ, పూలాంగ్, గంగాస్థాన్‌లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటర్ల జాబితా తీరుతెన్నులను పరిశీలన జరిపారు. ముఖ్యంగా ఒకే ఇంట్లో ఆరుగురు అంతకంటే ఎక్కువ ఓటర్లు ఉన్న వాటి గురించి వివరాలు ఆరా తీశారు. అంతకుముందు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, చిత్రామిశ్రా తదితరులు వారికి స్వాగతం పలికారు. నగరంలోని ఓ హోటల్‌లో ప్రత్యేకంగా ఓటర్ల జాబితాపై కలెక్టర్ నివేదికను బృందం సభ్యులకు అందజేశారు. నిజామాబాద్ ఆర్డీవో రవి, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

16న బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: జిల్లాకేంద్రంలో ఈ నెల 16న బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్ విభాగాల్లో క్రీడాకారుల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా రూరల్ గేమ్స్ కార్యదర్శి మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని బాల భవన్‌లో ఉదయం 10గంటలకు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలబాలికలకు పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

హాకీ అకాడమీకి ఎంపిక



అక్షయ

సిరికొండ: మండలంలోని తూంపల్లి గ్రామానికి చెందిన కంచర్ల అక్షయ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాకీ అకాడమీకి ఎంపికై ందని పీఈటీ నగేష్ బుధవారం తెలిపారు. ఫిబ్రవరిలో నిర్వహించిన అకాడమీ ఎంపిక పోటీల్లో అక్షయ ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు పేర్కొన్నారు. అకాడమీలో మంచి శిక్షణ పొంది జాతీయ జట్టుకి ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు. అక్షయను హెచ్‌ఎం సైరా సత్య, సర్పంచ్ బాలామణి అభినందించారు.

జిల్లా స్విమ్మింగ్ జట్ల ఎంపిక



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్‌జూనియర్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ ప్రభుత్వ స్విమ్మింగ్‌పూల్ ఆవరణలో బుధవారం క్రీడాకారులకు ఎంపిక పోటీలు నిర్వహించగా, ప్రతిభ చూపిన బాలబాలికలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షులు గడిల శ్రీరాములు, కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, డాక్టర్‌కైసర్, ఎన్ రాగినిలు నిర్వహించారు.

ఎంపికైన క్రీడాకారులు..

గ్రూప్–1లో..

బాలుర విభాగం:తేజస్, రిత్విక్, ఎడ్ల అక్షయ్‌దీప్, అనురాగ్, **బాలికల విభాగం:** హైందవిశ్రీ,, రిత్విక

గ్రూప్–2లో..

బాలుర విభాగం:సరుష్, షేక్ ఫైయిసల్ హైమాద్ హుస్సేన్,**బాలికల విభాగం:**జునైరానుల్, మేఘన, లక్ష్మీప్రియ, సాయిప్రజ్ఞ

గ్రూప్–3లో..

బాలుర విభాగం:సాయి అఖిల్ చారీ, గోగికర్ సురజ్ ,**బాలికల విభాగం:**సాయిశారద

తెరవే నూతన కార్యవర్గం



ప్రేమ్‌లాల్
జిల్లా అధ్యక్షుడు

నిజామాబాద్‌నాగారం/నిజామాబాద్ సిటీ: నగరంలోని హరిచరణ్ మార్వాడి పాఠశాలలో బుధవారం తెలంగాణ రచయితల వేదిక(తెరవే) జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని వేదిక సభ్యులు ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పంచరెడ్డి లక్ష్మన్, గౌరవ సలహాదారులుగా పబ్బా మురళి, జిల్లా అధ్యక్షుడిగా ప్రేమ్‌లాల్, ప్రధాన కార్యదర్శి వేముల శేఖర్, జిల్లా ఉపాధ్యక్షులుగా అన్నల్‌దాస్ కరుణాకర్, కానుగంటి ప్రకాష్, కార్యదర్శులుగా బోర్ఛర్‌కార్ చంద్రశేఖర్, ఎస్ లక్ష్మన్, బి గంగాధర్, జిల్లా నుంచి రాష్ట్ర కార్యదర్శిగా ధర్పల్లి సాయికుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా తెరవే రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూరారం శంకర్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్ వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు.

పూణె ల్యాబ్ అధ్యయనానికి జిల్లా సైన్స్ అధికారి

కామారెడ్డి టౌన్: మహారాష్ట్రలోని పూణెలోగల ప్యాబ్ ల్యాబ్ అధ్యయన పరిశీలనకు జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి ఇటీవల వెళ్లారు. రాష్ట్రంలోని విద్యార్థులకు అధునాతన సాంకేతిక ప్రయోగాల మీద ఆసక్తి పెంపొందించడానికి, పైలెట్ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రం నుంచి నాలుగు జిల్లాల సైన్స్ అధికారులు విజ్ఞాన అధ్యయనానికి పంపినట్లు వారు తెలిపారు. నిపుణుల అభిప్రాయాలు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లోని విశేషాలను అధ్యయనం చేయడానికి వెళ్లినట్లు తెలిపారు.

ఈనెల 10నుంచి 13వరకు అక్కడే ఉండి పరిశీలన చేస్తామన్నారు. తెలంగాణలోని 379 అటల్ టింకరింగ్ ట్యాబ్‌లను మరింత ఆకర్షణీయంగా, శక్తివంతం చేసి వినియోగం ద్వారా విద్యార్థులకు అందించేందుకు ఈ అధ్యయనం దోహదపడిందని తెలిపారు.

'ట్రాక్టర్' ఐడియా అదిరింది



సదాశివనగర్(ఎల్లారెడ్డి): బీటీ రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లను తిప్పకూడదని, ఒక వేళ రోడ్డుపై తిప్పితే బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని పోలీసులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో సదాశివనగర్‌లో ఓ రైతు తన ట్రాక్టర్ ఇంజిన్‌కు బిగించిన కేజీవీల్స్‌ను రోడ్డు దెబ్బతినకుండా పొలం వద్దకు తీసుకెళ్లడానికి వినూత్నంగా ఆలోచించాడు. కేజీవీల్ ట్రాక్టర్‌ను మరో ట్రాక్టర్ ఇంజిన్‌కు కట్టి పొలం వద్దకు తీసుకెళ్లాడు. ఈ దృశ్యం బుధవారం సాక్షి కెమెరాకు చిక్కింది.

ఢిల్లీ ఐఐటీకి గురుకుల విద్యార్థిని



శిల్ప

బాన్సువాడ రూరల్: మండలంలోని కొయ్యగుట్టలో సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన వి శిల్ప అనే విద్యార్థిని ఢిల్లీలోని ఐఐటీలో సీటు సా ధించినట్లు ప్రిన్సిపల్ శోభారాణి బుధవారం తెలిపారు. గాంధారి మండలం పెద్దగుజ్జుల్ తండాకు చెందిన శిల్ప ఐఐటీలో 1467వ ర్యాంకు సాధించిందన్నారు. దీంతో ఆమెకు ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ వి భాగంలో సీటు లభించిందన్నారు. శిల్పను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

నేడు పెన్షన్ అదాలత్

నిజామాబాద్ సిటీ: ఉద్యోగుల పెన్షన్ స్కీమ్ పెన్షనర్ల సమస్యలకు సంబంధించి పెన్షన్ అదాలత్ నేడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించనున్నట్లు పీఎఫ్ సహాయక కమిషనర్ బి మధుసూదనా చారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి 11.40 గంటల వరకు పెన్షనర్ల సమస్యల పరిష్కారాలకు సంబంధించిన ఫిర్యాదులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిర్యాదుదారులు వెబ్‌సైట్‌లో మీటింగ్ నంబర్ 2642 163 4185, పాస్‌వర్డ్ ఈఎన్‌ఎఫ్1234 ఎంటర్‌చేసి కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని ఆయన సూచించారు.

క్రైం కార్నర్

భార్య, కొడుకు మృతికి కారణమైన వ్యక్తికి ఏడేళ్ల జైలు

లింగంపేట/కామారెడ్డిటౌన్: భార్య, కొడుకు మృతికి కారణమైన ఓ వ్యక్తికి కామారెడ్డి సెషన్ కోర్టు జడ్జి శ్రీదేవి ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించినట్లు ఎస్సై శంకర్ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా.. లింగంపేట మండలం మెంగారం గ్రామానికి చెందిన కొండ విఠల్ పెద్ద కూతురు ఆమనికి, బాన్సువాడ మండలం హన్మాజీపేట గ్రామానికి చెందిన జొన్నల పోచయ్యకు 2013లో వివాహం జరిగింది. 6 నెలలు గడిచిన తర్వాత పోచయ్య కట్నం కింద ఇవ్వాల్సిన బైక్ కోసం భార్యను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. బైక్ కొనిచ్చినా కూడా ఆమెపై తరచూ వేధింపులకు పాల్పడేవాడు. ఈ క్రమంలో ఆమని జీవితంపై విరక్తి చెంది 2015 అక్టోబర్ 8న తనపై, కొడుకు రోహిత్‌పై కిరోసిన్ పోసి ఆత్మహత్యకు యత్నించింది. తీవ్ర గాయాలైన వీరిని హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితుడు పోచయ్యకు కోర్టు ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షను ఖరారు చేసింది. నిందితుడిని నిజామాబాద్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

లారీ డ్రైవర్‌కు రెండేళ్లు..

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో ఐదేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో లారీ డ్రైవర్‌కు రెండేళ్ల సాధారణ జైలుశిక్షను జడ్జి విధించారు. ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా... కమ్మర్‌పల్లిలోని గాంధీనగర్‌కు చెందిన అల్లం దుర్గయ్య 2018 అక్టోబర్ 22న తన బైక్‌పై కిరాణా షాపుకు వెళ్తుండగా, మార్గమధ్యలో లారీ ఢీకొట్టింది. దీంతో దుర్గయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన పంజాబ్ రాష్ట్రంలోని పఠాన్‌కోర్ జిల్లా భామ్‌లడా గ్రామానికి చెందిన టాకూర్ రాకేష్‌కుమార్‌పై అప్పటి ఎస్సై మురళి కేసు నమోదు చేశారు. ఆర్మూర్ కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి వేముల దీప్తి బుధవారం నిందితుడికి రెండు సంవత్సరాల సాధారణ జైలుశిక్ష, రూ. 5వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో రెండు రోజులు..

కామారెడ్డి క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఒకరికి కామారెడ్డి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. దేవునిపల్లి పోలీసులు రెండు రోజుల క్రితం పట్టణంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామానికి చెందిన రాజయ్య డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. దీంతో బుధవారం అతడిని కోర్టులో హాజరుపరిచారు. కామరెడ్డి కోర్టు ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష , రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

రోడ్డుపై నడిపిన కేజ్‌వీల్ ట్రాక్టర్ సీజ్



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని మాచాపూర్ గ్రామంలో కేజ్‌వీల్ ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై గణేష్ బుధవారం తెలిపారు. రోడ్డుపై కేజ్‌వీల్ ట్రాక్టర్ నడుపుతున్నారని గ్రామస్తులు సమాచారం అందించడంతో గ్రామానికి వెళ్లి సదరు కేజ్‌వీల్ ట్రాక్టర్‌ను సీజ్ చేసి, డ్రైవర్ నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రోడ్డుపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లను నడిపితే, రోడ్లు దెబ్బతింటాయని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ట్రాక్టర్ యజమానులు సహకరించాలని అన్నారు.

హెడ్ పోస్టాఫీస్‌లో ఆధార్ సేవల పునరుద్ధరణ

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ హెడ్ పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు పునరుద్ధరించబడినట్లు హెడ్ పోస్ట్‌మాస్టర్ గోలి గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ హెడ్ పోస్టాఫీస్ పరిధిలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. కొత్త ఆధార్ నమోదు, ఆధార్‌లో సవరణలకు, మొబైల్ నంబరు జత చేయటం, 5ఏళ్ల లోపు పిల్లలకు ఉచితంగా ఆధార్ నమోదు వంటి సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం సారంగపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రేపు(శుక్రవారం) విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఆర్ బాలేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రూరల్ నియోజకవర్గంలోని నిజామాబాద్ రూరల్, మోపాల్, జక్రాన్‌పల్లి, బర్ధిపూర్ సెక్షన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినియోగదారులకు రేపు సారంగపూర్ సబ్‌స్టేషన్‌లో అధికారులు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆలయాల్లో దొంగల బీభత్సం

- ఆభరణాలు, నగదు, గుడి గంటలు చోరీ



సీసీ టీవీలో నమోదైన దుండగుల దృశ్యాలు

డిచ్‌పల్లి: మండలంలోని మిట్టపల్లి, రాంపూర్ గ్రామాలలోగల ఆలయాల్లో గుర్తు తెలియని దుండగులు బీభత్సం సృష్టించారు. ఆయా ఆలయాల్లోని ఆభరణాలు, నగదును, గుడి గంటను చోరీ చేశారు. వివరాలు ఇలా.. మిట్టపల్లిలో రేణుకమాత ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి ఎల్లమ్మ విగ్రహంపై ఉన్న తాలిబొట్లు, హుండీలోని సుమారు రూ.30వేల నగదు చోరీ చేశారు. అలాగే సమీపంలోని మురళీకృష్ణ మందిరంలో రూ.లక్షన్నర నగదు, రూ.30వేల విలువగల గంటలు, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారు. అనంతరం రాంపూర్‌లోని రేణుకమాత ఎల్లమ్మ ఆలయంలో రూ. 50వేల విలువగల నగలు, గుడి గంటలు, ఇత్తడి సామగ్రి చోరీ చేశారు. హుండీలను ఎత్తుకెళ్లి సమీపంలోని పొలాల్లో వాటిని ధ్వంసం నగదులను అపహరించారు. మిట్టపల్లి ఆలయంలో చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. ఇద్దరు దుండగులు ముఖానికి మాస్కులు ధరించి చోరీకి పాల్పడ్డారు. ఆయా గ్రామాల సర్పంచులు, వీడీసీ సభ్యుల ఫిర్యాదు మేరకు డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మండలంలో వరుస చోరీలు జరగడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.